# అపస్వరం

"అమ్మా... అన్నయ్యొచ్చాడే" అంటూ ప్రసాద్ చిన్నతమ్ముడు బాబిగాడు ఇంటిలోకి పరుగెత్తాడు.

చిట్టి "అన్నయ్యొచ్చాడు... అన్నయ్యొచ్చాడు" అంటూ గంతులు వేసింది. ప్రసాద్ అక్కయ్య జానకి ప్రసాద్ చేతిలోని సూట్ కేసు అందుకుని ఓ ప్రక్కన పెట్టింది.

"ఇంత చిక్కిపోయావేమిటిరా తమ్ముడూ" అంది.

ప్రసాద్ ఏదో సమాధానం చెప్పేలోగా నాయనమ్మ లక్ష్మమ్మగారు హడావిడిగా వచ్చి ప్రసాద్‌ని కౌగిలించుకున్నారు.

"మా నాయనే... మా నాయనే... వచ్చేశావా ?... అదేమిట్రా అబ్బాయ్... పుల్లలా అయిపోయావ్.. కాస్త నల్లబడ్డావ్ కూడా... హాస్టలులో భోజనం సరిగ్గా పెట్టరా?" అని అడిగారు.

లక్ష్మమ్మగారికి ప్రసాద్ అంటే వల్లమాలిన ప్రేమ. అందుకు కారణం ప్రసాద్‌ది వాళ్ల తాతగారి పేరు కావడమే.

ఇంతలో వంటింటిలోంచి ప్రసాద్ తల్లి సీతమ్మ వచ్చింది. వెనకాలే వార చేరేసిన బాబిగాడు కూడా ... గెత్తుకవచ్చాడు.

"ఏరా?... ఉత్తరం రాయకుండానే ఊడిపడ్డావే?...

సంక్రాంతి శెలవులు యిచ్చేశారా?... దసరాకి వచ్చినప్పుడే నయం... యిప్పుడు మరీ చిక్కిపోయావేంరా?... నీ ఆరోగ్యం బావుంటుందా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది సీతమ్మ.

వీళ్ళందరి ప్రేమానురాగాలకి ప్రసాద్ ఉక్కిరి బిక్కిరి అయిపోతున్నాడు.

"ఏరా... చదువులు ఎలా సాగుతున్నాయి?..." అంటూ అప్పుడే హాల్లోకి వచ్చిన రాఘవయ్య ప్రశ్నించాడు.

"నువ్వుండరా అబ్బాయ్... కుర్రనాగన్న ఇంటికి రాగానే, చదువుల మాటెత్తుతావు... పాపం... ఎప్పుడనగా భోజనం చేశాడో ఏమో?... వంటయిపోయిందిగానీ నువ్వు త్వరగా స్నానం చెయ్యరాబాబూ... వేడివేడిగా యింత తిందువుగాని" అంటూ లక్ష్మమ్మగారు ప్రసాద్‌ని లాక్కెళ్ళారు.

చిట్టి ప్రసాద్ సూట్‌కేసు తణిఖీ చేస్తుంది. తనకోసం అన్నయ్యేమైనా తెచ్చాడేమోనని. చిట్టి శ్రమ ఫలించింది.

"అన్నయ్య స్వీట్సూ బొమ్మలూ తెచ్చాడోచ్" అంటూ గంతులు వేసింది చిట్టి.

ఎక్కడినుండో సుడిగాలిలా వచ్చాడు బాబిగాడు. చిట్టి చేతుల్లోంచి స్వీట్స్ పాకెట్ లాక్కుని "స్వీట్స్ నాకు... బొమ్మలు నీకు" అన్నాడు. చిట్టి ఏడుపు లంకించుకుంది. దానికి తెలుసు బాబిగాడు స్వీట్సు తిన్నతరువాత బొమ్మలు కూడా లాక్కుంటాడని.

"ఒరేయ్ బాబిగా...చెల్లెలి దగ్గరనుండి అలా లాక్కొచ్చావా?... తప్పమ్మా... స్వీట్సు యిద్దరూ పంచుకోవాలమ్మా

...మా బాబిగాడు మంచివాడు కదూ...'' అంటూ జానకి వాడిని మచ్చిక చేసింది.

వాడు చిట్టికి సగం స్వీట్సు యిచ్చాడు. అది ఏడుపు మాని అప్పటికప్పుడే నవ్వేసింది.

భోజనాలయ్యాక అందరూ వరండాలో చేరి కబుర్లలో పడ్డారు. ప్రసాద్ కాలేజీ కబుర్లూ హాస్టలు కబుర్లూ చెప్తుంటే మిగతావాళ్లంతా అతని చుట్టూ చేరి శ్రద్ధగా వింటున్నారు. రాఘవయ్య మాత్రం ఒక మూలగా పుస్తకం చదువుతూ కూర్చున్నాడు. సీతమ్మ ఆయనకు ఎదురుగా కూర్చుని ప్రసాద్ చెప్పేమాటలు వింటుంది.

''మరేమో... అన్నయ్యా... మీ హాస్టలులో ఆడుకోనిస్తారా?'' చిట్టి తన ధర్మసందేహాన్ని వెలిబుచ్చింది.

"నీ మొఖం! హాస్టలులో ఆడిదే టీచర్లు తంతారు... హాస్టలులో చదువుకోవాలి.... తెలుసా?" బాబిగాడు అన్నయ్య చెప్పే మాటలకు చిట్టి అడ్డు తగిలినందుకు విసుక్కున్నాడు.

''అబ్బాయ్... మరి హాస్టలులో అంతమంది వుంటారు కదా... ఎక్కడ పెట్టిన వస్తువులు అక్కడే ఉంటాయా లేక పోతే మాయమైపోతుంటాయా?'' అంటూ లక్ష్మమ్మగారు ప్రశ్నించారు.

జానికి కిసుక్కున నవ్వింది. లక్ష్మమ్మగారు జానకి వైపు మిర్రిమిరి చూశారు.

''నిజమే నాయనమ్మా... అక్కడ అటువంటి అబ్బాయిలు కూడా వుంటారు. ఒకసారి నేను బల్లమీద పడి

రూపాయల నోటు పెట్టి మర్చిపోయి స్నానానికి వెళ్ళాను. తిరిగివచ్చి చూస్తే అక్కడ లేదు. ఎవర్ని అడిగినా నాకు తెలియదు అంటే నాకు తెలియదు అన్నారు'' అంటూ ప్రసాద్ హాస్టలులో యింకా ఎవరెవరి వస్తువులు ఎలా పోయాయో చెప్పాడు.

అలా వాళ్ళు మాట్లాడుకునే విషయాలు దొంగలమీదకు మళ్ళింది. లక్ష్మమ్మగారు దొంగల కథలు చాల చెప్పారు. తరువాత వారి టాపిక్ దయ్యాలలోకి మారింది.

"నాయనమ్మా... అసలు దయ్యాలనేవి నిజంగా వుంటాయా?'' ఇంతదాకా ప్రసంగించుతున్న ప్రసాద్‌కి యిప్పుడు ప్రశ్నలడగడం అతని వంతయింది.

''ఎందుకులేవూ? దయ్యాలలోనే చాలరకాలున్నాయి. కొరివి దెయ్యాలు, కామినీ పిశాచాలు, భూతాలు యిలా రకరకాలున్నాయి" అన్నారు లక్ష్మమ్మగారు అందరి ముఖాల్లోకి చూస్తూ. దయ్యాల గురించి అక్కడ కూర్చునివున్న వారిలో తనకే క్షుణ్ణంగా తెలుసునన్న గర్వం ఆమె ముఖంలో కనిపిస్తుంది. చిట్టి, బాబిగాడు గుడ్లప్పగించి ఆవిడ ముఖంలోకి చూస్తున్నారు.

"ఏమో ! దయ్యాలంటే నాకు నమ్మకం లేదు... ఇప్పటివరకు నాకు ఒక్క దయ్యంకూడా కనబడలేదు - మరి నన్ను ఎలా నమ్మమంటావ్?" ప్రసాద్ నిర్లక్ష్యంగామాట్లాడాడు.

'నీకేం తెలుసురా కుర్రసన్నాసి... నా చిన్నప్పుడు

ఒకసారి దయ్యాన్ని చూశాను...' అంటూ లక్ష్మమ్మగారు దయ్యాలగురించి వరుసగా కథలు చెప్పసాగారు. అందరూ చీమ చిటుక్కుమన్నంత శబ్దంకూడా చెయ్యకుండా బొమ్మల్లా కూర్చుని ఆవిడ చెప్పేమాటలు వింటున్నారు. మధ్యమధ్య చిట్టి భయంగా యింటిచుట్టూవుండే చీకటిని చూస్తుంది.

సీతమ్మ అత్తగారు చెప్పే కథలకు విసుక్కుంది. "చిన్నపిల్లలకు అటువంటి కథలు చెప్పితే జడుసు కుంటారన్న జ్ఞానం అయినా లేదు" అని అనుకుంది.

లక్ష్మమ్మగారు యివేమి గమనించకుండా తన ధోరణిలో తాను చెప్పుకపోతున్నారు. సీతమ్మ రాఘవయ్య చెవిలో ఏదో ఊదింది.

'ఏవిటమ్మా ఆ దయ్యాల కథలు?... పిల్లలు జడుసు కోరూ అటువంటి కథలు చెప్పితే?... అంటూ రాఘవయ్య విసుక్కున్నాడు.

లక్ష్మమ్మగారు కథ ఆపుజేశారు. పిల్లలు నిరుత్సాహం చెందారు.

'ఇక నిద్రపొండి... ఇప్పటికే చాల రాత్రయింది' అంటూ రాఘవయ్య యింటిలోకి వెళ్లిపోయాడు. సీతమ్మ అతనిని అనుసరించింది.

'నాన్నమ్మా... నాన్నగారు వెళ్లిపోయారుగా? మళ్లీ దయ్యం కథ చెప్పు నాన్నమ్మా...' అంటూ బాబిగాడు మారాం చేశాడు

"వద్దురా అబ్బి... మీనాన్న వింటే తిడతారు... పదండి లోపలికి పోయి పడుకుందాం.'

చిట్టి మత్తు కళ్ళతో జోగుతూ లేచింది. జానకి చిట్టిని పడిపోకుండా పట్టుకుంది.

'పదరా అబ్బాయ్' లక్ష్మమ్మగారు ప్రసాద్ బుజం తట్టారు.

'నేను బాబిగాడు యిక్కడే వరండాలో పడుకుంటాం నాన్నమ్మా...' అన్నాడు ప్రసాద్.

"అమ్మో... నాకుభయం!... నేను లోపలే పడుకుంటాను..." అప్పటివరకూ విన్న దయ్యం కథలను గుర్తు చేసుకుంటూ గుండెలమీద చెయ్యి వేసుకున్నాడు బాబిగాడు.

'నువ్వుకూడా లోపలికి పదరా అబ్బాయ్ ఒక్కడివే ఏం పడుకుంటావ్?...'

'ఇక్కడే చల్లగా...హాయిగా బావుంటుంది నాన్నమ్మా... నేనిక్కడే పడుకుంటాను..." అన్నాడు ప్రసాద్.

''సరే...నీ యిష్టం...'' లక్ష్మమ్మ బాబిగాడిని తీసుకుని వెళ్ళారు. వెనకాలే జానకి చిట్టిని ఎత్తుకుని లోపలికి వెళ్ళింది.

ప్రసాద్ వరండాలో నవారు మంచం వేసుకుని పడుకున్నాడు. అప్పటివరకూ లక్ష్మమ్మగారు చెప్పిన దయ్యం కథలు మననం చేసుకుంటూ దయ్యాలు ఉన్నాయా లేదా అని ఆలోచించ సాగాడు. లక్ష్మమ్మగారు చెప్పిన విషయాలు పరిశీలిస్తే దయ్యాలున్నాయన్న నమ్మకం కలుగుతుంది...

ఛ...ఛ...దయ్యాలు లేవు...భూతాలు లేవు...అదంతా భ్రమ వుంటే తన కింతవరకూ ఎందుకు కనిపించలేదు?... అనుకున్నాడు. అలా అనుకున్నాడు గానీ మళ్లీ చుట్టూవున్న చీకటిని చూస్తే భయం వేసింది. పిచ్చిపిచ్చిగా ఆలోచిస్తూ ఎప్పుడు నిద్ర పట్టేసిందో...ప్రసాద్ నిద్రపోయాడు.

హఠాత్తుగా అర్ధరాత్రి ప్రసాద్‌కి మెలకువ వచ్చింది. ప్రసాద్‌ని ఎవరో వెనుకనుండి కౌగలించుకుని ప్రక్కనే పడుకున్నారు, బాబిగాడే మధ్య రాత్రి వచ్చి తన ప్రక్కన పడుకున్నాడేమో!...తనని కౌగలించుకున్న చేతుల్ని తడిమాడు ప్రసాద్. ఆ చేతులు సున్నితంగా మెత్తగా ఉన్నాయి. చేతి గాజులు తగిలాయి. ప్రసాద్ వులిక్కిపడ్డాడు. మంచంమీదినుండి లేవబోయాడు. ఆ రెండుచేతులూ ప్రసాద్‌ని లేవనీయకుండా మరీ గట్టిగా బిగించి మీదికి లాక్కున్నాయి. ప్రసాద్ బోర్లా ఆమెమీద పడ్డాడు.

ప్రసాద్ ఉలిక్కిపడ్డాడు.

"ఎవరు నువ్వు... ఏమిటిది?"., అయోమయంగా ప్రశ్నించాడు.

"నేనండీ... నన్నే మర్చిపోయారా?" ఆమె ప్రసాద్‌ని మరింత గట్టిగా తనకు అదుముకుంది.

"ఛీ...వదులు..." ప్రసాద్ వదిలించుకోడానికి ప్రయత్నించాడు.

"నేను మీ భార్యని... మీపాదదాసిని... నన్ను యిలా

విదిలించుకోడం మీకు న్యాయమేనా?... రండి... నాలో కలిసి పొండి..."

ఆమె ప్రసాద్ మీదికి ప్రాకింది. ఆమె ముఖం ప్రసాద్ ముఖం మీదికి వంగింది. ప్రసాద్ కళ్ళు బాగా తెరచి ఆమె ముఖంవైపు చూశాడు. ఆ చీకటిలో ఆమె ముఖం ఆనవాళ్ళు తెలియడంలేదు ఆమె ప్రసాద్ పెదాలతో తన పెదాలు కలిపింది. ప్రసాద్ పెదాలు చిట్లి రక్తం కారింది. ప్రసాద్ శరీరానికి ఆమె శరీరం వెచ్చగా రాచుకుంటుంది ఉన్నట్లుండి అతనికి లక్ష్మమ్మగారు చెప్పిన కామినీపిశాచం కథలు వరుసగా గుర్తుకువచ్చాయి. ప్రసాద్ శరీరంలోని రక్తం గడ్డకట్టింది. ఒళ్ళు చల్లబడింది. భయంవల్ల అతనిలోకి ఏదో ఒక అదృశ్యశక్తి ప్రవేశించింది. చటుక్కున ఆమెను విదుల్చుకుని నిలబడ్డాడు. ఆమె అంత దూరంలో ఎగిరిపడింది.

"ఏమండీ... నేను!... మీ భార్యను!!...నన్ను మర్చిపోయారా?..." ఆమె మళ్ళీవచ్చి ప్రసాద్ మీద పడబోయింది.

ప్రసాద్ తప్పుకున్నాడు

"ఛీ... వెళ్ళిపో యిక్కడినుండి..." అన్నాడు.

ప్రసాద్ వైపు రాబోయిన ఆమె చటుక్కున ఆగిపోయింది. కొన్నిక్షణాలు ఆమె తీవ్రంగా ప్రసాద్ వైపు చూస్తూ నిలబడింది. ఆమె ఉచ్ఛ్వాస నిశ్వాసాల శబ్దం ఆ నిశ్శబ్ద నిశీధిలో భయంకరంగా అతని చెవులకు సోకుతుంది. ప్రసాద్ కాళ్ళు వణుకుతున్నాయి. ఇది తప్పకుండా ఏ కామిని పిశాచమో అయ్యుంటుంది అనుకున్నాడు.

ఆమె వున్నట్లుండి క్రిందికి వంగి మంచం ప్రక్కనుండి ఒక పెద్ద బెత్తం తీసింది. ప్రసాద్ పై ప్రాణాలు పైనే పోయాయి. ఆమె పులిలా ముందుకు దూకింది. ప్రసాద్ ఏమి జరుగుతుందో ఊహించేలోగా ఆమెమీద పడి బెత్తంతో బాదడం మొదలు బెట్టింది.

ప్రసాద్ గావుకేక పెట్టి వెనక్కు పిరుచుకు పడ్డాడు. అతని కేక చీకటిని చీల్చుకుంటూ భయంకరంగా ప్రతిధ్వనించింది. ఆమె బెత్తాన్ని గాలిలో ఊపుకుంటూ రయ్యిమని చీకటిలోకి దూసుకుపోయింది.

ప్రసాద్ గావుకేక విని యింటిలోంచి అందరూ బయటికి పరుగెత్తుకు వచ్చారు. నేలమీద పడిఉన్న ప్రసాద్‌ని చూసి రాఘవయ్య కంగారు పడిపోయాడు. సీతమ్మా, లక్ష్మమ్మగారూ గుండెలు బాదుకుని రోదించారు. జానకి పిచ్చిదానిలా చూస్తూ కూర్చుంది. పిల్లలిద్దరూ ఏడుపు లకించుకున్నారు.

ప్రసాద్ ముఖంమీద నీళ్ళు జల్లాడు రాఘవరావు. ప్రసాద్ నెమ్మదిగా కళ్ళు తెరిచాడు. లక్ష్మమ్మగారు నెమ్మదిగా ప్రసాద్ చేత మంచినీళ్ళు త్రాగించారు. ప్రసాద్ కొంతసేపు లక్ష్మమ్మగారి ఒడిలో తల పెట్టుకుని అలానే కదలకుండా పడుకున్నాడు. భయంవల్ల అతనిగుండె ఇంకా ఎగిరెగిరి పడుతూంది.

కొంతసేపయిన తరువాత ప్రసాద్ జరిగిన కథంతా చెప్పాడు. రాఘవరావుకు ఏమీ అర్థంకాలేదు. లక్ష్మమ్మగారు మాత్రం అది తప్పకుండా కామినీ పిశాచమే అని తీర్మానించారు. ఆమె తీర్మానాన్ని అవుననాలో కాదనాలో మిగతా వారికి తోచలేదు.

ప్రసాద్ భయంవల్ల ఒక నాలుగు రోజులపాటు జ్వరం పడ్డాడు. ఆరోజు నుండీ ప్రసాద్ వరండాలో పడుకోవడం మానేశాడు.

ఆరోజు—

ఉదయం భోజనాలయిన తరువాత రాఘవయ్య ఎక్కడికో బయటికి వెళ్ళి పోయాడు. సీతమ్మ, లక్ష్మమ్మగారూ జానకి వరండాలో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. బాబిగాడు, చిట్టి ఒకమూల లక్కపిడతలు పెట్టుకుని ఆడుకుంటున్నారు. ప్రసాద్ లోపలిగదిలో కూర్చుని నవలేదో చదువుకుంటున్నాడు.

కొంతసేపయిన తరువాత ఒకమ్మాయి రాఘవరావు ఇంటికి వచ్చి వరండాలో ఉన్న సీతమ్మను, లక్ష్మమ్మగారిని పలకరించింది. ఆమె వయసు ఇరవై ఆరు ఉండవచ్చునేమో!... ఓమాదిరి రూపం ఆమెది,

"ఏం కావాలమ్మాయ్?" అంటూ లక్ష్మమ్మగారు ప్రశ్నించారు.

"మాది ఈ ప్రక్క ఊరేనండి...మానాన్నగారికి మేము అయిదుమంది ఆడపిల్లలం... మాకు ఒక అన్నయ్య కూడా ఉన్నాడు" అంటూ ఆ అమ్మాయి ఏమేమో చెప్తుంది.

గదిలోపల ఉన్న ప్రసాద్‌కి ఈ మాటలన్నీ వినిపిస్తున్నాయి. తన కష్టాలు చెప్పుకుని ఋణమో ఫణమో సహాయం చెయ్యమని అడుగుతుందని కాబోలు అనుకున్నాడు.

నా అక్కలు ఐదుగురికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. నాక్కూడా పెళ్ళయిపోయింది లెండి... మీరు నాకు పెళ్ళి కాలేదని అనుకుంటున్నారుకదూ... నాకు తెలుసు... నాకు పోయిన సంవత్సరమే పెళ్ళయింది. నా అక్కయ్యలకంటే మంచిసంబంధం దొరికింది. ఆయన ఆరడుగుల పొడవుంటారు చాల అందంగా ఉంటారు...''

ఆమె తన భర్తను గురించి ఏమేమో పొగుడుతూ చెప్పుకుపోతుంది లక్ష్మమ్మగారు ఆమెవచ్చిన పనేమిటని రెండు మూడుసార్లు అడిగారు. ఆమె అదేమీ పట్టించుకోకుండా తన సోదంతా చెప్పుకుపోతుంది.

ఉన్నట్లుండి ఆమె కెవ్వున కేకేసింది. ఏమైందోనని ప్రసాద్ లోపలినుండి వరండాలోకి కంగారుగా వచ్చాడు. అప్పుడే రాఘవరావు ఇంటివైపు ఇద్దరు వ్యక్తులు పరుగులు పెడుతూ వస్తున్నారు. ఆమె వాళ్ళను చూసే కేకలు పెట్టింది.

''రాకండి...మీరు నా దగ్గరకు రాకండి...ఏమండీ... మీరు వాళ్ళని పొమ్మనరూ?... వాళ్ళు రాక్షసులు!... నన్ను ఇంటికి తీసుకెళ్ళి గదిలోపెట్టి తాళం పెట్టేస్తారు. వాళ్లను పొమ్మనండీ...'' ఆమె లక్ష్మమ్మగారిని ప్రాధేయపడింది.

వాళ్ళెవరికీ అదేమీ అర్ధంకావడంలేదు

''లక్ష్మీ... ఏమిటమ్మా ఇది?... తప్పుకదూ?... రా యింటికి పోదాం...'' అన్నారు వచ్చిన ఇద్దరు వ్యక్తులలో ఒకతను.

"నేను రాను ఫో...మీ రెందుకు వచ్చారు?...పొండి" లక్ష్మి అనబడే ఆమె అతనివైపు ఎర్రగా చూస్తూ అంది.

"అలా మారాం చెయ్యకండి అమ్మాయిగోరూ... మీరు మంచివారుకదూ?... ఇంటికి రండమ్మాయిగోరూ?" రెండవ వ్యక్తి అన్నాడు.

"పెళ్లయిన ఆడవాళ్ళు అత్తింటిలో ఉండాలి గాని పుట్టింటిలో ఉంటారేమిటి?...నేను మీ యింటికి రాను...మా ఆయన ఎక్కడుంటే అదే నాయిల్లు" అంది లక్ష్మి.

ఇంతలో ప్రసాద్ ఆమె దృష్టిలో పడ్డాడు.

"ఆ...అదిగో మా ఆయన...ఏమండీ...వీళ్ళు నన్ను తీసుకువెళ్లడానికి వస్తే చూస్తూ ఊరుకున్నారేం?...నన్ను పంపనని చెప్పండి" అంటూ ప్రసాద్ దగ్గరికి పరుగెత్తుకు వచ్చింది. ఇప్పటికి పరిస్థితి కొంత అవగాహన అయ్యింది.

మొదటి వ్యక్తి రివ్వున ముందుకువచ్చి లక్ష్మిని ప్రసాద్ మీద పడకుండా రెక్క పట్టుకుని ప్రక్కకు లాగేశాడు.

"వదులు... నన్నొదులు" అంటూ లక్ష్మి గింజుకో సాగింది. అతను లక్ష్మిని బుజ్జగించుతూ నచ్చజెప్పుతున్నాడు. లక్ష్మి ప్రసాద్‌వైపు చూస్తూ "ఏవండీ...చూడండీ యీ రాక్షసుడు నన్ను ఇంటికి రమ్మని పీక్కుతింటున్నాడు... మీరొచ్చి వీడికి రెండు తగలనివ్వండి..." అంటున్నది. అతను లక్ష్మిని రెక్కపట్టుకుని బతిమలాడుతూ ఏమో అంటున్నాడు. ఆమె తల అడ్డంగా ఊపుతూ ఏమో అంటున్నది. కళ్ళముందు జరుగుతున్నదంతా నోరు తెరుచుకొని చూస్తున్నారు జానకి,

సీతమ్మా లక్ష్మమ్మగారు. ప్రసాద్ రెండవవ్యక్తిని అసలుసంగ తేమిటని అడిగాడు. అతను చెప్పడం మొదలుపెట్టాడు.

వాళ్ళది ఆ ప్రక్క వూరు. అతను లక్ష్మి వాళ్ళింటిలో పాలేరు. ఆ మొదటి వ్యక్తి లక్ష్మికి అన్నయ్య అవుతాడు. లక్ష్మికి యింకా ఐదుగురు అక్కయ్యలున్నారు. లక్ష్మి తండ్రి పోలయ్య మొదటి ఐదుగురు అమ్మాయిలకు పెళ్ళిళ్ళు చేసేసరికి ఆస్థంతా కరిగిపోయింది. అసలే వాళ్ళ కులంలో కట్నాలు ఎక్కువ అవడంచేత తనకున్న పొలాలు, వాళ్ళ కట్నాలు పెళ్ళి ఖర్చులక్రింద అమ్మేశాడు. లక్ష్మి పెళ్ళీడుకు వచ్చేసరికి అతని ఆస్థంతా హరించుకు పోయింది. లక్ష్మికి ఎన్నో సంబంధాలు వచ్చాయి. కాని కట్నాలవద్ద కుదరక అన్నీ తప్పిపోయాయి. లక్ష్మి దురదృష్టమో ఏమో ఒకసారి పెళ్ళి చూపులకనివస్తున్న ఒకబ్బాయిని లారీ గుద్దేసింది. ఆ అబ్బాయి అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘనవల్ల లక్ష్మికి సంబంధాలే రావడం తగ్గిపోయాయి. పోలయ్య లక్ష్మికి పెళ్ళి కాదేమోనని బెంగ పడిపోయాడు,

లక్ష్మికి పదహారేళ్ళనుండే పెళ్ళి చేసుకోవాలన్న కోర్కె చాల బలంగా వుంది. ఆమె యెప్పుడూ తనకు కాబోయే భర్తను గురించి ఊహిస్తూ తీయని కలలు కనేది. రోజు రోజుకీ ఆమెలోని కోర్కె తీవ్రం కాసాగింది.

ఆమెకు ఇరవై ఏళ్ళు దాటినా పెళ్లికాలేదు లక్ష్మికి రానురాను తండ్రిమీద, అన్నయ్యమీద ద్వేషం పెరిగిపోయింది. వాళ్ళు నిద్రపోతున్నప్పుడు మెల్లగా లేచి గొడ్డలితో నరికేయా లని అనుకునేది. ఆమెలోని కోర్కెలు తీవ్రమయినకొద్దీ ఆమె

మరీ పిచ్చిదై పోసాగింది. ఒక్కొక్కప్పుడు తనవైపు ఆదేపనిగా చూసే ప్రక్కింటి రామంతో లేచిపోదాం అనుకునేది గానీ సంఘం, సాంప్రదాయం అన్నీ గుర్తుకు వచ్చి తనను నిత్యం దహించివేసే కోర్కెలను బలవంతంగా అణచుకునేది.

మరో మూడు ఏళ్ళు గడిచిపోయాయి. లక్ష్మికి అప్పుడు ఇరవై అయిదేళ్ళు. పోలయ్య ఆమె పెళ్ళి గురించి పట్టించుకోవడం మానేశాడు. తొమ్మిదేళ్ళనుండి అణచుకున్న కోర్కెలు విజృంభించి ఆమె మనసును మథించివేశాయి. ఆమె మనసంతా అల్లకల్లోలం అయిపోయేది.

తను అవివాహిత!...తనకు భర్తలేదు!!...తన అక్కయ్యలకు భర్తలున్నారు...తనకు భర్తలేదు...

ఆమె హృదయం ఆక్రోశించింది.

ఇన్నాళ్ళుగా అణిచిపెట్టుకున్న కోర్కెలు విజృంభించాయి. ఎక్కడికైనా రామంతో లేచిపొమ్మంది అంతరాత్మ. మనసు ఒప్పుకోలేదు.

బలమైన కోర్కెలకూ భయపడే మనసుకూ మధ్య పెద్ద పోరాటం సాగింది. ఫలితం లక్ష్మి పిచ్చిదై పోయింది. అప్పటినుండి లక్ష్మి కనబడిన ప్రతి ఒక్కరికీ తనకు పెళ్ళయిందనీ ఫలానా ఊరిలో తన భర్త ఉన్నాడనీ, చాల అందంగా ఉంటాడనీ, మంచివాడనీ ఏమేమో చెప్తుంటుంది. కాస్త అందంగా వున్న అబ్బాయి కనబడితే అతనిమీద పడి నువ్వే "నా భర్త" అంటుంది. అందుచేత పోలయ్య లక్ష్మి ఇల్లు కదలకుండా కట్టుదిట్టాలు చేసేవాడు. ఆమెను గదిలో పెట్టి తాళం

వేసేవాడు అప్పుడప్పుడూ లక్ష్మి ఇంటిలోంచి పారిపోతుంటుంది. పోలయ్య, పాలేరులు, లక్ష్మి అన్నయ్యా నలుగురూ నాలుగువైపులా వెతికి లక్ష్మిని పట్టుకునేవారు. ఇలా ఒక సంవత్సరం నుండి జరుగుతుంది.

కథ చెప్పడం ఆపి నిట్టూర్చాడు పాలేరు. అతను చెప్పిన విషయాలు విన్నతరువాత అక్కడున్నవారందరి హృదయాలు బరువెక్కాయి. లక్ష్మమ్మగారు చెంగుతో కళ్ళు వొత్తుకున్నారు.

"రంగయ్యా...మనం పోదాం పద" అని పిలిచాడు లక్ష్మి అన్నయ్య. అతను యెట్లాగో తంటాలుపడి లక్ష్మికి నచ్చచెప్పినట్టున్నాడు. ఆమె బుద్ధిగా అతని ప్రక్క నిలబడి వుంది. రంగయ్యా, లక్ష్మి అన్నయ్యా వాళ్ళందరివద్ద శలవుతీసుకుని లక్ష్మిని తీసుకొని వెళ్ళిపోయారు.

ప్రసాద్‌కి హఠాత్తుగా తను ఊరినుండి వచ్చిన మొదటి రోజు రాత్రి జరిగిన సంఘటన గుర్తుకి వచ్చింది. అవును!... ఆరోజు రాత్రి వచ్చింది యీ అమ్మాయే...సందేహం లేదు.... అనుకున్నాడు,

''నాన్నమ్మోయ్...'' ఉన్నట్లుండి అరిచాడు ప్రసాద్.

లక్ష్మమ్మగారు ఏమిటన్నట్లు చూశారు.

"దయ్యాలు, కామినీపిశాచాలు లేవు నాన్నమ్మా... నాకు నమ్మకం లేదు...అదంతా భ్రమ...ఇకనుండి నేను చస్తే నమ్మను'' అన్నాడు.

లక్ష్మమ్మగారికి ఇప్పుడు ప్రసాద్ ఆ విషయంగురించి ఎందుకు మాట్లాడుతున్నాడో అర్థం కాలేదు.

జానకి వరండాలో స్థంభానికి ఆనుకుని ఎటో శూన్యం లోకి చూస్తుంది.

"ఏమిటో కొందరి జీవితాలు వాణి చక్కగా కుదిరిన గీతంలా మధురంగా వుంటాయి...మరి కొందరి జీవితాలు అన్నీ అపస్వరాలతో కూర్చిన గీతంలా దుర్భరంగా వుంటాయి" అనుకుంది ఇంకా పెళ్ళికాని ఇరవై అయిదేళ్ళ జానకి.

11-8-77, ఆంధ్ర పత్రిక